సాక్షి నిజామాబాద్

శనివారం । 10 । మే । 2025



కానరాని గ్రామీణ క్రీడలు

పిల్లలు గ్రామీణ క్రీడలకు దూరమవుతున్నారు. శారీరకంగా, మానసికంగా తీర్చిదిద్దే క్రీడలను వదిలి సెల్‌ఫోన్లకు బానిసలవుతున్నారు.

- 10లో ▸



అశ్రునయనాలతో..

నక్సల్స్ అమర్చిన మందుపాతరకు బలైన గ్రేహౌండ్స్ కమాండర్ వడ్ల శ్రీధర్ అంత్యక్రియలు పాల్వంచలో నిర్వహించారు.

- 10లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 40.5 /23.6

ఉదయం ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. వడగాలులు వీస్తాయి. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

పసుపును పరిశీలించిన రొమేనియా వ్యాపారి



సుభాష్‌నగర్: రొమేనియా దేశానికి చెందిన పసుపు ఎగుమతిదారుడు వైలెంటీను శుక్రవారం నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డు సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ అపర్ణను తన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. యూరప్ దేశాలకు ఎగుమతి చేసేందుకు పసుపు నాణ్యత, పంట, మార్కెటింగ్ వ్యవస్థ తదితర అంశాలపై అధ్యయనం చేసేందుకు నిజామాబాద్‌కు వచ్చానని వైలెంటీను తెలిపారు. ఎగుమతికి అవసరమైన పసుపును తమ రైతు ఉత్పత్తిదారుల సంఘం నుంచి సరఫరా చేస్తామని జేఎంకేపీఎం ఎఫ్‌పీవో చైర్మన్ పాటుకూరి తిరుపతిరెడ్డి వైలెంటీనుకు తెలిపారు. జేఎంకేపీఎం ఇందూరు పసుపు బ్రాండ్ ప్యాకెట్‌ను ఆయనకు అందజేశారు. అనంతరం పసుపు పండించే గ్రామాలు, పసుపు రకాలు, నాణ్యత, తదితర అంశాలను తిరుపతిరెడ్డి వివరించారు.


ఆమ్‌చూర్ ధర పైపైకి..



సుభాష్‌నగర్: నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్‌యార్డులో ఆమ్‌చూర్ ధర క్రమంగా పెరుగుతోంది. గురువారం క్వింటాల్ ధర రూ.29,500 ఉండగా, శుక్రవారం ఏకంగా రూ.3500 పెరిగి రూ.33వేలకు చేరుకుంది. శుక్రవారం మార్కెట్‌కు 438 క్వింటాళ్ల ఆమ్‌చూర్ రాగా, మోడల్ ధర రూ.20,100 పలికింది.

గృహజ్యోతికి భానుడి ఎఫెక్ట్

గృహజ్యోతి.. ఈ పథకం ద్వారా 200 యూనిట్లలోపు విద్యుత్‌ను వినియోగించేవారికి జీరో బిల్లు వర్తిస్తుంది. వేసవి నేపథ్యంలో ఎండ వేడిమి నుంచి ఉపశమనం కోసం ప్రజలు ఫ్యాన్లు, కూలర్లు వినియోగిస్తుండడంతో విద్యుత్ వినియోగం 200 యూనిట్లు దాటుతోంది. దీంతో చాలా మంది లబ్ధిదారులు ఈ పథకానికి దూరమవుతున్నారు.



- జిల్లాలో అధిక ఉష్ణోగ్రతలు నమోదు
- పెరిగిన కూలర్లు, ఫ్యాన్ల వినియోగం
- పరిధి దాటుతున్న విద్యుత్ యూనిట్లు
- ఉచిత విద్యుత్ పథకానికి 62వేల కుటుంబాల దూరం

పెరిగిన విద్యుత్ వినియోగం..

వేసవిలో రాష్ట్రంలోనే జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మార్చిలో సగటు ఉష్ణోగ్రతలు 38 డిగ్రీల నుంచి 40 వరకు నమోదు కాగా, ఏప్రిల్‌లో 42 డిగ్రీలకుపైగా నమోదయ్యాయి. ఎండ వేడిమికి వడగాల్పులు తోడుకావడంతో జిల్లాలో విద్యుత్ వినియోగం విపరీతంగా పెరిగింది. దీంతో ప్రజలు ఇళ్లకే పరిమితం కావడం, చల్లదనం కోసం జోరుగా కూలర్లు వినియోగిస్తున్నారు. గతేడాది ఏప్రిల్‌లో 200 మిలియన్ యూనిట్ల వినియోగం కాగా, ఈసారి అంతకు మించి వినియోగించినట్లు అధికారులు పేర్కొంటున్నారు. వినియోగం పెరగడంతో గృహజ్యోతి లబ్ధిదారుల ఇళ్లలో 200 యూనిట్ల పరిధి దాటుతోంది.

సుభాష్‌నగర్: పేదలకు ఉచిత విద్యుత్ అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న గృహజ్యోతిపై భానుడి ప్రభావం పడింది. రోజురోజుకూ పెరుగుతున్న ఎండ తీవ్రతకు విద్యుత్ వినియోగం పెరిగి మీటర్లు గిర్రున తిరుగుతున్నాయి. ఫ్యాన్లు, కూలర్ల వినియోగంతో ఏప్రిల్ నెలలో 62వేల కుటుంబాలు గృహజ్యోతి లబ్ధికి దూరమయ్యాయి.

జిల్లాలో నివాసగృహాలకు 4.80 లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ప్రభుత్వం 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించే పేదల కోసం గృహజ్యోతి పథకాన్ని తీసుకొచ్చింది. జిల్లా వ్యాప్తంగా 2.81 లక్షల కనెక్షన్లకు ఈ పథకం వర్తిస్తుంది. ఈ కేటగిరీలో యూనిట్ ధర సాధారణంగా 1 నుంచి 50 యూనిట్ల వరకు రూ.1.95, 51 నుంచి 100 యూనిట్ల వరకు రూ.3.10, 101 నుంచి 200 యూనిట్ల వరకు రూ.4.80, 200 యూనిట్లు దాటితే రూ.5.10 చొప్పున బిల్లులు చెల్లించాల్సి ఉంటుంది. ఈ లెక్కన 200 యూనిట్లు దాటిన వారికి రూ.వెయ్యికి పైగా బిల్లులు వస్తున్నాయి.

“ 200 యూనిట్లు దాటితే వర్తించదు



విద్యుత్ వినియోగం 200 యూనిట్లు దాటితే గృహజ్యోతి పథకం వర్తించదు. ఎండల తీవ్రతతో విద్యుత్ వినియోగం పెరిగింది. ఏప్రిల్‌లో 62 వేల కుటుంబాలు ఈ పథకానికి దూరంకాగా, 2.19 లక్షల కుటుంబాలకు మాత్రమే గృహజ్యోతి వర్తించింది.

– రాపెల్లి రవీందర్, ఎస్‌ఈ, ఎన్‌పీడీసీఎల్



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న జర్నలిస్టు సంఘాల నాయకులు, సాక్షి సిబ్బంది

నిరసన గళమెత్తిన జర్నలిస్టులు

- 'సాక్షి' ఎడిటర్‌పై అక్రమ కేసులు ఎత్తివేయాలి
- కలెక్టరేట్ ఎదుట నల్లబ్యాడ్జీలతో నిరసన

నిజామాబాద్‌అర్బన్: 'సాక్షి' దినపత్రిక ఎడిటర్ ధనంజయరెడ్డిపై నమోదు చేసిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని, సెర్చ్ వారెంట్ లేకుండా ఆయన ఇంట్లో సోదాలు నిర్వహించడం సరైంది కాదని జర్నలిస్టులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ధనంజయరెడ్డిపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నమోదు చేసిన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం జిల్లాలోని అన్ని జర్నలిస్టు సంఘాల నాయకులు కలెక్టరేట్ ఎదుట సుమారు రెండు గంటలపాటు నిరసన తెలిపాయి. 'జర్నలిస్టుల ఐక్యత వర్ధిల్లాలి.. ఎడిటర్ ధనంజయరెడ్డికి న్యాయం జరగాలి..' అంటూ నల్లబ్యాడ్జీలు ధరించి నినాదాలు చేశారు. ఏపీలోని కూటమి ప్రభుత్వం కక్షసాధింపు చర్యలను మానుకోవాలన్నారు.

ఈ సందర్భంగా తెలంగాణ జర్నలిస్టుల ఫోరం రాష్ట్రనాయకుడు జమాల్‌పూర్ గణేశ్ మాట్లాడుతూ.. పత్రికా స్వేచ్ఛను, హక్కులను ప్రభుత్వాలు హరించడం సరికాదన్నారు.మీడియాపై దౌర్జన్యాలు కొనసాగితే ఊరుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఐజేయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొబ్బిలి నర్సయ్య మాట్లాడుతూ.. సాక్షి ఎడిటర్ ధనంజయరెడ్డి ఇంటిపై పోలీసుల దాడులను ఖండిస్తున్నామన్నారు. ఇలాగే కొనసాగితే జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడుతామన్నారు. నిజామాబాద్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు రామకృష్ణ మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సాక్షి దినపత్రికపై దౌర్జన్యం కొనసాగిస్తోందని, అధికార బలంతో అణగదొక్కాలని చూస్తోందని విమర్శించారు. ఎడిటర్ ధనంజయరెడ్డిపై పోలీసులు అక్రమ కేసులు నమోదు చేయడమే ఇందుకు నిదర్శనమన్నారు. ఐజేయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రమోద్‌గౌడ్, నాయకుడు రవికుమార్, నిజామాబాద్ ప్రెస్‌క్లబ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ మండే మోహన్, తెలంగాణ విద్యావంతుల వేదిక నాయకుడు ఆశనారాయణ తదితరులు ప్రసంగించారు. అనంతరం కలెక్టరేట్ ప్రవేశ మార్గం నుంచి నిరసన ప్రదర్శనగా వెళ్లి అదనపు కలెక్టర్ అంకిత్‌కు వినతిపత్రం అందజేశారు.



అదనపుకలెక్టర్ అంకిత్‌కు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టు నాయకులు

కార్యక్రమంలో జర్నలిస్టు సంఘాల నాయకులు ధనుంజయ్, ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి అంగల రామ్‌చందర్, సదానంద్, పంచరెడ్డి శ్రీకాంత్, దేవల్ రవిబాబు, ఇంగుశ్రీనివాస్, ఉమామహేశ్వర్, కొక్క రవి, ఆంజనేయులు, జాన్సన్, సురేశ్, సాక్షి బ్యూరో ఇన్‌చార్జి భద్రారెడ్డి, ఎడిషన్ ఇన్‌చార్జి ప్రభాకర్, సాక్షి టీవీ వీడియో జర్నలిస్ట్ సాయికిరణ్, నిజామాబాద్ ఆర్‌సీ ఇన్‌చార్జి సంజీవ్, రూరల్ ఆర్‌సీ ఇన్‌చార్జి మురళి తదితరులు పాల్గొన్నారు.



గురుశిష్యుల వైభవం!

తన వద్ద విద్యాభ్యాసం చేసి సకల విద్యలలో పండితుడైన శిష్యుడు ఎంతటి శక్తిమంతుడో సూర్యభగవానుడు చూపుతున్నట్లు ఉంది ఈ చిత్రం. సూర్యుడు అస్తమిస్తూ తన కిరణాలతో హనుమంతుడికి అలంకరణ చేసినట్లు కనిపించిన ఈ దృశ్యాన్ని డొంకేశ్వర్ మండలం జీజీ నడ్కుడవద్ద 'సాక్షి' కెమెరాలో బంధించింది. – డొంకేశ్వర్(ఆర్మూర్)

ఆపరేషన్ సిందూర్ విజయవంతానికి పూజలు

- అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

సుభాష్‌నగర్: పాకిస్తాన్‌పై భారత్ ఘన విజయం సాధించి ఉగ్రవాదుల నెత్తుటితో భరతమాతకు వీర తిలకం దిద్దడమే ఆపరేషన్ సిందూర్ అని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పేర్కొన్నారు. యుద్ధంలో భారత సైన్యానికి, భూభాగానికి, ప్రజలకు ఎలాంటి నష్టం జరగకూడదని, ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావాలని బీజేపీ నగరశాఖ ఆధ్వర్యంలో నగరంలోని నీలకంఠేశ్వర ఆలయంలో శుక్రవారం ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ భారత సైన్యం తలచుకుంటే పాకిస్తాన్‌ను ప్రపంచపటంలో లేకుండా చేస్తుందని హెచ్చరించారు. ప్రపంచ దేశాలు సైతం ఉగ్రవాదానికి వ్యతిరేకంగా, భారత్‌కు మద్దతిస్తున్నాయన్నారు. ప్రపంచదేశాలు భారత్‌ను ప్రశంసిస్తుంటే.. కొందరు మనవాళ్లే కించపర్చడం బాధాకరమని, వారిపై దేశద్రోహం కేసు పెట్టి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు న్యాలం రాజు, నాగోళ్ల లక్ష్మీనారాయణ, నారాయణ యాదవ్, కొండా ఆశన్న, ప్రభాకర్, మఠం పవన్, పల్నాటి కార్తీక్, కార్యకర్తలు పాల్గొన్నారు.



నీలకంఠేశ్వరాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్

'ఎర్లీబర్డ్'తో రూ.15 కోట్లు ఆదాయం

- గతం కంటే రూ.4 కోట్లు అధికం
- సిబ్బందిని ప్రశంసించిన కమిషనర్

నిజామాబాద్ సిటీ: రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన ముందస్తు చెల్లింపు (ఎర్లీబర్డ్)తో నగర పాలక సంస్థకు మంచి ఆదాయం వచ్చింది. 2024–2025 ఆర్థిక సంవత్సరానికి నగరవాసులు బల్దియాకు మార్చి 31లోగా పన్నులు చెల్లించాల్సి ఉంది. కానీ, ప్రభుత్వం మరో 37 రోజులు గడువు పొడిగించడంతోపాటు ముందస్తు పన్నుల చెల్లింపులో 5 శాతం రాయితీ అవకాశం కల్పించింది. రాయితీ స్కీం ఈ నెల 7తో ముగియగా, నగరవాసులు సద్వినియోగం చేసుకున్నారు. మార్చి 31 వరకు పన్నుల రూపంలో రూ.44.40 కోట్లు వసూలు కాగా, ఎర్లీబర్డ్‌తో మరో రూ.14.85 కోట్లు వచ్చాయి. గతేడాదితో పోల్చితే ఈ సంవత్సరం రూ. 4 కోట్లు అధికంగా వసూలయ్యాయి. ఈ వసూళ్లలో పాల్గొన్న వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్, రెవెన్యూ సిబ్బందిని మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్ ప్రశంసించారు.

మందుల్లేవు.. వైద్యులు రారు

- ఈఎస్ఐ ఆస్పత్రుల్లో అడుగడుగునా ఇబ్బందులు
- రోగులకు తప్పని ఇక్కట్లు
- ఇలా వచ్చి అలా వెళ్తున్న వైద్యులు
- పట్టించుకోని ఉన్నతాధికారులు

నిజామాబాద్‌నాగారం: ఆరోగ్యభద్రతను ఇస్తాయనుకున్న ఈఎస్ఐ ఆస్పత్రులు మందులు లేక, టైమ్‌కి వైద్యులు రాక వెలవెలబోతున్నాయి. ఉమ్మడి జిల్లా(నిజామాబాద్, కామారెడ్డి)కు సంబంధించి ఈఎస్ఐ ఆస్పత్రులు రెండు నిజామాబాద్ నగరంలోని రేడియోస్టేషన్ ప్రాంతంలో, కంఠేశ్వర్‌లో ఉన్నాయి. అయితే సంఘటిత, అసంఘటిత కార్మికులు, జీతాల్లో ఈఎస్ఐ కట్ అయ్యే చిన్నచిన్న ఉద్యోగులు వైద్య సేవలందక ఇబ్బందులు పడుతున్నారు. గత కొన్ని నెలలుగా ఈఎస్ఐ ఆస్పత్రుల్లో మందులు ఉండడం లేదని, వైద్యులు ఇలా వచ్చి అలా వెళ్తున్నారని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కామారెడ్డి, బోధన్, ఆర్మూర్, బాన్సువాడ తదితర దూర ప్రాంతాల నుంచి వస్తున్నవారు ఇబ్బందులు పడుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ శాఖల్లో అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులు సుమారు 2వేల మందికిపైగానే ఉన్నారు. వీరి తోపాటు ప్రైవేట్ సంస్థల్లో ఆయా రంగాల్లో చిరుద్యోగులు, కార్మికులు సుమారు 13వేల వరకు ఉన్నారు. న్యాల్‌కల్‌రోడ్‌లో ఉన్న ఈఎస్ఐ ఆస్పత్రిలో 10వేల కార్డులు ఉండగా, ప్రతినిత్యం 80మందికిపైగా చికిత్స కోసం వస్తుండగా, కంఠేశ్వర్ ప్రాంతంలో ఉన్న ఈఎస్ఐ ఆస్పత్రుల్లో 5వేలకు పైన కార్డులు ఉన్నాయి. ఇక్కడికి ప్రతిరోజూ 50 మందికి పైగా రోగులు వస్తున్నారు.



న్యాల్‌కల్‌రోడ్‌లో ఉన్న ఈఎస్ఐ ఆస్పత్రి

పర్యవేక్షణ లేదు

రెండు ఈఎస్ఐ ఆస్పత్రులపై పర్యవేక్షణ లేకుండా పోయింది. రెండు ఆస్పత్రులను కలెక్టర్ ఒకసారి సందర్శిస్తే ఇక్కడి పరిస్థితి, అందుతున్న వైద్య సేవల వివరాలు తెలుస్తాయని రోగులు అంటున్నారు.

➡ నిజామాబాద్ నగరానికి చెందిన గంగవ్వ(58) ఈనెల 8వ తేదీన తన కొడుకుతో కలిసి కంఠేశ్వర్ ప్రాంతంలోని ఈఎస్ఐ ఆస్పత్రికి బీపీ మందుల కోసం వచ్చింది. అక్కడి సిబ్బంది మందులు లేవని చెప్పడంతో వెనుదిరిగి వెళ్లిపోయింది.

➡ కామారెడ్డికి చెందిన రమేశ్ అనారోగ్యంతో బాధపడుతూ న్యాల్‌కల్ రోడ్‌లోని ఈఎస్ఐ ఆస్పత్రికి గురువారం వచ్చాడు. వైద్యులు లేకపోవడంతో ఏం చేయాలో తెలియక ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లిపోయాడు.

లంచ్‌కి వెళ్తే అటే..

ఉదయం 9 నుంచి సాయంత్రం 4గంటల వరకు వైద్యులు, సిబ్బంది కచ్చితంగా అందుబాటులో ఉండి రోగులకు వైద్య సేవలు అందించాలి. కానీ ఉదయం వస్తున్న వారు లంచ్‌కి వెళ్తే మళ్లీ రావడం లేదు. ఎక్స్‌రే, ఈసీజీ, ల్యాబ్‌ల నిర్వహణను పట్టించుకునే వారు లేరు.

బీపీ బిళ్లలూ ఉండవు..

ఈఎస్ఐ ఆస్పత్రుల్లో మందుల కొరత తీవ్రంగా ఉంది. ముఖ్యంగా బీపీ, థైరాయిడ్, కొలస్ట్రాల్ తదితర మందులు లేవు. చిన్న పిల్లలకు సంబంధించిన మందులు సైతం ఉండడం లేదు. కేవలం జ్వరం, నొప్పుల మందులు మాత్రమే అందుబాటులో ఉన్నాయని ఫార్మసిస్టులు చెబుతున్నారు.

గుప్పుమంటున్న గాంజా

- బానిసలుగా మారుతున్న యువకులు
- నగరంలో ముగ్గురు గంజాయి కింగ్‌లు
- దాడులు చేస్తున్నా తగ్గని సప్లైదారులు
- మైనర్లతో అమ్మకాలు



ఖలీల్‌వాడి: జిల్లాలో గంజాయి గుప్పుమంటోంది. గుట్టుగా రవాణా అవుతోంది. పల్లెల్లో యువకులు కొందరు మత్తుకు బానిసలుగా మారారు. గంజాయి పీల్చడానికి అలవాటు పడి గమ్మత్తులో ఊగుతున్నారు. దీంతో కుటుంబాలు ఛిన్నాభిన్నమైపోతున్నాయి. పోలీసులు, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు దాడులు చేసి కేసులు నమోదు చేస్తున్నా అక్రమ దందాకు అడ్డుకట్ట పడడం లేదు. స్మగర్లు గంజాయిని వివిధ రాష్ట్రాల నుంచి తీసుకువచ్చి మహారాష్ట్రలోని నాందేడ్ ప్రాంతంలో డంప్ చేస్తున్నట్లు పోలీసులు, ఎక్సైజ్ వర్గాలు గుర్తించాయి. అవసరం మేరకు నిజామాబాద్, నిర్మల్, జగిత్యాల వంటి ప్రాంతాలకు తరలిస్తూ విక్రయిస్తున్నారు.

- ఏప్రిల్ 21న నవీపేట్ మండలం యంచ వద్ద కారులో రవాణా చేస్తున్న 30.250 కిలోల ఎండు గంజాయిని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది పట్టుకున్నారు. రూ.6 లక్షల విలువ జేసే గంజాయిని స్వాధీనం చేసుకొని ఐదుగురిపై కేసులు నమోదు చేశారు.
- ఫిబ్రవరి 11న నిజాంసాగర్ మండలం మాగి చౌరస్తా వద్ద 90.630 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకొని ముగ్గురిని పట్టుకున్నారు. కర్ణాటక నుంచి మహారాష్ట్రలోని నాందేడ్ ప్రాంతానికి గంజాయిని తరలిస్తున్నట్లు గుర్తించారు. గంజాయి విలువ రూ.22.50 లక్షల ఉంటుంది.

మైనర్లతో విక్రయాలు..

టీ పాయింట్లు, ఖాళీ ప్రదేశాలు, గ్రామ శివారు ప్రాంతాలే అడ్డాగా గంజాయి దందా నడుస్తోంది. చాక్లెట్ ప్యాకెట్లు, లిక్విడ్ రూపంలో తయారు చేసి గుట్టుచప్పుడు కాకుండా అమ్మకాలు సాగిస్తున్నారు.



యంచ వద్ద గంజాయితో పట్టుబడిన నిందితులు (ఫైల్)

నగరంలో గంజాయిని ముగ్గురు వ్యక్తులు అమ్మకాలు సాగిస్తున్నట్లు పోలీసులు, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గుర్తించారు. వీరిలో ఒకరిపై పీడీయాక్ట్ నమోదు చేశారు. మరొకరు ఇటీవల జైలు నుంచి బయటికి వచ్చినట్లు తెలిసింది. ఇంకొకరు మైనర్ల ద్వారా గంజాయి అమ్మకాలు సాగిస్తున్నాడు. నెల రోజుల క్రితం ముగ్గురు బాలురు గంజాయి విక్రయిస్తూ పోలీసులకు పట్టుబడగా, వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి వదిలేశారు. కాగా, ఓ బాలుడు మాత్రం తీరు మార్చుకోకుండా గంజాయి విక్రయిస్తూ కత్తులను వెంటబెట్టుకొని తిరుగుతున్నట్లు సమాచారం. ఆ బాలుడిని పట్టుకునేందుకు పోలీసులు రంగం సిద్ధం చేయగా పరారైనట్లు తెలిసింది.

“ నిఘా పెట్టాం

గంజాయి సరఫరా, విక్రయాలపై ప్రత్యేక నిఘా పెట్టాం. నగరంలో కొంతమంది మైనర్లను అడ్డుపెట్టుకొని గంజాయి అమ్మకాలు సాగిస్తున్నారు. మైనర్లపై కూడా కేసులు నమోదు చేస్తాం. యువత గంజాయికి దూరంగా ఉండాలి. గంజాయి అమ్మకాలు, వినియోగంపై సమాచారం అందిస్తే వివరాలను గోప్యంగా ఉంచుతాం.

– స్వప్న, జిల్లా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌చార్జి ఏఈఎస్

గంజాయిపై ఉక్కు పాదం మోపండి

బాల్కొండ: గంజాయిపై ఉక్కు పాదం మోపాలని సీపీ సాయి చైతన్య పోలీసు సిబ్బందికి సూచించారు. బాల్కొండ, ముప్కాల్, మెండోరా పోలీస్ స్టేషన్‌లను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. క్రైం రేట్ వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో గంజాయిపై ఉక్కు పాదం మోపేందుకు కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. పోలీస్ స్టేషన్‌లలో 5ఎస్ విధానం తప్పకుండా అమలు చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని, సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ప్రస్తుతం యుద్ధ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో సైబర్ నేరాలపై మరింత జాగ్రత్తగా ఉండాలన్నారు. సీపీ వెంట బాల్కొండ, ముప్కాల్, మెండోరా ఎస్సైలు నరేశ్, రజనీకాంత్, అర్పాత్, సిబ్బంది ఉన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న సీపీ సాయిచైతన్య

జీలుగ వచ్చేసింది

డొంకేశ్వర్(ఆర్మూర్): ఖరీఫ్‌కు అవసరమైన జీలుగ విత్తనాలు జిల్లాకు చేరుకుంటున్నాయి. 'పత్తాలేని జీలుగ విత్తనాలు' శీర్షికన ఈ నెల 8న సాక్షిలో కథనం ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. లారీల్లో వేగవంతగా బస్తాలను జిల్లాకు తెప్పిస్తున్నారు. పదివేల క్వింటాళ్ల జీలుగ విత్తనాలు అవసరం ఉండగా మొదటి విడత కొంత స్టాకు జిల్లాకు వచ్చింది. బస్తాలను ప్రధాన గోదాముల్లో దింపుతున్నారు. ప్రధాన గోదాముల నుంచి మండలాలు, గ్రామాలకు చేరవేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. విత్తనాలను రైతులకు యాభై శాతం సబ్సిడీపై అందించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కిలోకు రూ.142, బస్తాకు అయితే రూ.2,137 ధర నిర్ణయించగా సబ్సిడీ వర్తించనుంది. జనుము విత్తనాలు కిలోకు రూ.125 ఉండగా బస్తాకు రూ.2,510గా ధర నిర్ణయించారు. రెండు రోజుల్లో జీలుగ, జనుము విత్తనాల పంపిణీ ప్రారంభమవుతుందని, రైతులు పాస్‌పుస్తకం జిరాక్స్ కాపీని సొసైటీల్లో అందజేసి విత్తనాలు పొందాలని డీఏవో వీరాస్వామి సూచించారు.



క్లుప్తంగా

నెట్‌బాల్‌ రాష్ట్రస్థాయి టోర్నీకి జిల్లా జట్ల ఎంపిక

నిజామాబాద్‌నాగారం: నెట్‌బాల్‌ రాష్ట్రస్థాయి టోర్నీకి జిల్లా బాలబాలికల జట్లను ఎంపిక చేశారు. జిల్లా నెట్‌బాల్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో శుక్రవారం నిజామాబాద్‌ రూరల్‌ మండలంలోని తిర్మన్‌పల్లి ప్రభుత్వ జెడ్పీ హైస్కూల్‌లో అండర్‌–16 విభాగం బాలబాలికల ఎంపికలు నిర్వహించారు. ప్రతిభ చూపిన వారిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేయగా, వారు ఈ నెల 15 నుంచి 18 వరకు జనగామ జరిగే రాష్ట్రస్థాయి టోర్నీలో పాల్గొనున్నారు. కార్యక్రమంలో నెట్‌బాల్‌ అసోసియేషన్‌ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌ రావు జనరల్‌ సెక్రెటరీ ఏ రమేశ్‌, పీఈటీలు గంగాధర్‌, నాగరాజ్‌, రమేశ్‌ గౌడ్‌, కుమార్‌, కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

బాలుర జట్టు:



జీ యశ్వంత్‌, జీ సామ్రాట్‌, వనితేజ్‌, వరుణ్‌ తేజ్‌, భువన్‌ తేజ్‌, ఎస్‌ విజయ్‌, టీ భరత్‌ కుమార్‌, వై అమర్‌, టీ మహేశ్‌, పీ నిఖిల్‌, టీ సంపత్‌, జీ స్నుహన్‌. స్టాండ్‌ బైగా పీ శేఖర్‌, స్వరాజ్‌ గౌడ్‌, సాత్విక్‌, నితిన్‌.

బాలికల జట్టు :



ఈ నయన శ్రీ, బీ అక్షయ, బీ సింధు, బీ మహిమ, కే నందిని, ఎం శ్రీహర్షిత, జీ నేహా, పీ లేయ, ఈ మృణాళిని, పీ అక్షయ, బీ గాయత్రి, కే మేఘన. స్టాండ్‌ బైగా జీ గీత. ఎం మహేశ్వరి, వీ శృతి, వీ సంధ్య, ఎస్‌ వైష్ణవి, ఎం రిషిత.

దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్‌అర్బన్‌: జిల్లాలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పారిశ్రామిక రంగాల పనితీరును మెరుగుపర్చేందుకు జిల్లా పరిశ్రమల కేంద్రంలో మేనేజర్‌, అసిస్టెంట్‌ మేనేజర్‌ పోస్టుల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తునట్లు కలెక్టర్‌ రాజీవ్‌ గాంధీ హనుమంతు శుక్రవారం తెలిపారు. పోస్టులను కాంట్రాక్టు పద్ధతిన భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. అర్హులు, ఆసక్తి ఉన్నవారు మే 10లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు www.nimsme.gov.in వెబ్‌సైట్‌ ను సంప్రదించాలని, మరిన్ని వివరాల కోసం జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్‌ మేనేజర్‌ సురేష్‌కుమార్‌, సెల్‌ నంబర్‌ 9640909831ను సంప్రదించాలని సూచించారు.

కానరాని గ్రామీణ క్రీడలు

- వేసవి సెలవుల్లో ఆటలాడని పిల్లలు
- సెల్‌ ఫోన్‌లు, టీవీలు, ఇంటర్నెట్‌, వీడియో గేమ్‌లకు పరిమితమవుతున్న వైనం
- గత చరిత్రగా నిలిచిపోనున్న పల్లె ఆటలు



వంగుడు దుంకుడు ఆడుతున్న చిన్నారులు (ఫైల్‌)



ఆర్మూర్‌ ప్రాంతంలో గోటీలు ఆడుతున్న చిన్నారులు (ఫైల్‌)

ఆర్మూర్‌: ఆ రోజులే వేరు.. వేసవి సెలవులు వస్తే చాలు.. పిల్లలు అమ్మమ్మ వాల్లింటికి వెళ్లి స్నేహితులతో కలిసి గిల్లి దండా, కోతి కొమ్మచ్చి, గోటీలు ఆడుకొనే వారు. ఆడ, మగ తేడా లేకుండా తోటి పిల్లలతో దాగుడు మూతలు, కైలాసం, అష్ట చమ్మ ఇతర ఆటలు ఆడుతూ ఉల్లాసంగా గడిపేవారు. కానీ నేటితరం బాలలు ఆటలను పట్టించుకోకుండా సెల్‌ ఫోన్లు, టీవీలు, ఇంటర్‌నెట్‌, వీడియోగేమ్‌లకు బానిసలవుతున్నారు.

ఇంటికే పరిమితం..

తల్లిదండ్రుల వైఖరి, వేసవి ఎండల కారణంగా పిల్లలు సెలవు దినాల్లోనూ ఇంటికే పరిమితం అవుతున్నారు. వేల సంఖ్యలో వస్తున్న టీవీ ఛానళ్లలో కార్టూన్స్‌ చూడటం, ఓటీటీలు, వీడియో గేమ్స్‌ ఆడుకోవడం, ఫోన్‌లలో గేమ్స్‌ ఆడుకోవడం, ఇంటర్నెట్‌, సోషల్‌ మీడియాతో బిజీ బిజీగా ఉంటున్నారు. శారీరక శ్రమను కల్పించే క్రీడలకు దూరం అవుతున్నారు. ఇప్పటికైనా తల్లిదండ్రులు స్పందించి పిల్లలను శారీరక శ్రమ కల్పించే క్రీడలను ఆడించాలని, ఫోన్లను దూరంగా ఉంచాలని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



ఆర్మూర్‌ ప్రాంతంలో బ్యాట్‌లతో ఆడుకుంటున్న గ్రామీణ బాలికలు (ఫైల్‌)



పయ్యలతో ఆడుకుంటున్న చిన్నారులు (ఫైల్‌)

క్రీడలతో ఎన్నో లాభాలు..

చిన్నతనంలో పిల్లల్లో స్నేహభావం, ఐకమత్యం, ఏకాగ్రత, క్రమశిక్షణ, సోదర భావం, సమానత్వంతో పాటు శారీరక శ్రమ, మెదడుకు మేత పెట్టేవి గ్రామీణ క్రీడలు. కానీ ప్రస్తుత పోటీ ప్రపంచంలో తమ పిల్లలు అందరికంటే ముందుండాలనే తపనతో తల్లిదండ్రులు తాము గడిపిన అందమైన బాల్యాన్ని తమ పిల్లలకు దూరం చేస్తున్నారు. ఫలితంగా శారీరక శ్రమ లేక, తోటి మిత్రులతో కమ్యూనికేషన్‌ ఏవిధంగా ఏర్పరచుకోవాలో తెలియక, మెదడుకు మేత లేక చిన్నారులు చదువుకొనే యంత్రాల్లా తయారవుతున్నారు. పోనీ పాఠశాలల్లోనైనా ఆటలు ఆడిపిస్తారా అంటే కార్పొరేట్‌ విద్యా వ్యవస్థలో అసలు ఆడుకునే మైదానాలే కరువయ్యాయి.

అప్పట్లో సెలవులంటే..

కంప్యూటర్‌, వీడియోగేమ్‌, సెల్‌ ఫోన్‌, ఇంటర్‌నెట్‌ హవా ప్రారంభం కాకముందు దసరా, సంక్రాంతి, ఎండాకాలం సెలవులు వచ్చాయంటే చాలు గ్రామాల్లో సందడి నెలకొనేది. ఉద్యోగాల రీత్యా ఇతర ప్రాంతాల్లో ఉండే వారంతా సెలవు దినాల్లో తమ గ్రామాలకు వచ్చే వారు. ఈక్రమంలో పిల్లలు నిత్యం వీధుల్లో ఆటలు ఆడుతూ కనిపించే వారు. అలాగే గ్రామాల్లో ఉండే చెరువులు, కాలువల్లో ఈత కొట్టడం ఒక మధురానుభూతి. క్రమంగా ఈ ఆటలు ఆడేవారు కనుమరుగవుతున్నారు.

గ్రామీణ క్రీడలతో ఐక్యతా భావం..



కలిసి కట్టుగా గ్రామాల్లో పిల్లలు క్రీడలు ఆడటం వల్ల వారిలో ఐక్యతా భావం పెరుగుతుంది. మానసికంగా పిల్లలను బలవంతులను చేస్తుంది.

– అశోక్‌, డిస్ట్రిక్ట్‌ ఇమ్యునైజేషన్‌ ఆఫీసర్‌, ఆర్మూర్‌

క్రీడలతోనే మానసికోల్లాసం..



క్రీడలతోనే మానసికోల్లాసం లభిస్తోందని ప్రతీ ఒక్కరు గుర్తించాలి. కనీసం సెలవు దినాల్లోనైనా పిల్లలు తమకు ఇష్టమైన ఆటలు ఆడుకొనేలా ప్రోత్సహించాలి.

– బత్తుల శ్రీనివాస్‌, అధ్యాపకుడు, డిగ్రీ కళాశాల, భీమ్‌గల్‌

ప్రాధాన్యతను తెలియజెప్పాలి



గ్రామీణ క్రీడల ప్రాధాన్యతను నేటి తరం పిల్లలకు పరిచయం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సెల్‌ ఫోన్‌లు, టీవీల పుణ్యమా అని అసలు క్రీడలంటేనే తెలియని పరిస్థితి ప్రమాదకరం.

– రమేష్‌, డిప్యూటీ డీఎంహెచ్‌వో, ఆర్మూర్‌

అన్ని ఆటలు ఆడించాలి



గ్రామీణ క్రీడలు ఆడుతున్న పిల్లలను వారిస్తూ పాశ్చాత్య ధోరణితో వ్యవహరిస్తున్న తల్లిదండ్రులు తమ ఆలోచన విధానాన్ని మార్చుకోవాలి. పిల్లలచే అన్ని రకాల క్రీడలను ఆడిపించాలి.

– కృష్ణ పండిత్‌, న్యాయవాది, ఆర్మూర్‌

అశ్రునయనాలతో అంత్యక్రియలు

- పాల్వంచలో గ్రేహౌండ్స్‌ జవాన్‌కు అంతిమ వీడ్కోలు
- నివాళులర్పించిన మంత్రి పొన్నం, షబ్బీర్‌, మదన్‌మోహన్‌
- అధికార లాంఛనాలతో అంత్యక్రియలు



శ్రీధర్‌ అంతిమయాత్రలో పాల్గొన్న ప్రజలు (ఇన్‌సెట్‌లో) మృతుడు శ్రీధర్‌ (ఫైల్‌)

కామారెడ్డి క్రైం/మాచారెడ్డి : నక్సల్స్‌ అమర్చిన మందుపాతరకు బలైన గ్రేహౌండ్స్‌ జవాన్‌ వడ్ల శ్రీధర్‌ అంత్యక్రియలు శుక్రవారం పాల్వంచ మండల కేంద్రంలో అధికార లాంఛనాలతో జరిగాయి. పాల్వంచ గ్రామస్తులే కాక చుట్టుపక్కల గ్రామాల నుంచి వేలాది మంది ప్రజలు తరలివచ్చి జవాన్‌కు కన్నీటి వీడ్కోలు పలికారు. కలెక్టర్‌ ఆశిష్‌ సంగ్వాన్‌, ఎస్పీ రాజేశ్‌ చంద్ర ఆధ్వర్యంలో అధికార లాంఛనాలతో అంత్యక్రియలకు ఏర్పాట్లు చేయగా.. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌ అలీ, జహీరాబాద్‌ ఎంపీ సురేశ్‌ షెట్కార్‌, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు, కామారెడ్డి ఏఎస్పీ చైతన్యరెడ్డి తదితరులు శ్రీధర్‌ మృతదేహంపై పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. మంత్రి పొన్నం బాధిత కుటుంబాన్ని ఓదార్చిన అనంతరం ఆయన మాట్లాడారు. పెళ్లయిన 8 నెలలకే శ్రీధర్‌ మృతి చెందడం బాధాకరం అన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందన్నారు. మృతి చెందిన కానిస్టేబుల్‌ కుటుంబానికి ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ.2.17 కోట్లతో పాటు 300 గజాల స్థలం, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వం ఉద్యోగం ఇస్తామని పేర్కొన్నారు.

శ్రీధర్‌ ఆత్మశాంతి కోసం పాల్వంచ గ్రామస్తులు శుక్రవారం రాత్రి కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన చిత్ర పటం వద్ద కొవ్వొత్తులు ఉంచి నివాళులర్పించారు.

సైనికులకు అండగా నిలుద్దాం



మాట్లాడుతున్న సినీనటి పూనమ్‌ కౌర్‌



హాజరైన భక్తులు

నిజామాబాద్‌ రూరల్‌: మన దేశానికి, పాకిస్తాన్‌కు మధ్య జరుగుతున్న యుద్ధంలో భారత సైనికులకు అండగా నిలుద్దామని సినీనటి పూనమ్‌ కౌర్‌ అన్నారు. నగరంలోని నాందేవాడ బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయాన్ని శుక్రవారం ఆమె సందర్శించారు. ఈసందర్భంగా పూనమ్‌కౌర్‌ మాట్లాడుతూ.. ఉగ్రవాదులను మట్టుపెట్టేందుకు భారత సైనికులు తమ ప్రాణాలు లెక్క చేయకుండా యుద్ధంలో పోరాడుతున్నారని ఇటువంటి సైనికులకు మనమంతా మద్దతు తెలుపుతూ అండగా నిలవాలన్నారు. గతంలో తాను పాకిస్తాన్‌ దేశంలో పర్యటించి అక్కడ శివాలయంలో పూజలు చేశానన్నారు. అనంతరం చిన్నారి ప్రదర్శించిన నాట్యం అలరించింది. బ్రహ్మకుమారి ఐశ్వర్య, నాందేవాడ సెంటర్‌ నిర్వాహకురాలు సునీత బహేంజీ తదితరులున్నారు.

నగరంలో నేడు 2కే రన్‌



సమావేశంలో మాట్లాడుతున్న వైద్యులు

నిజామాబాద్‌నాగారం: నగరంలో శనివారం వరల్డ్‌ లూపస్‌ డే సందర్భంగా రుమటాలజిస్ట్‌ గ్రీష్మ ఆధ్వర్యంలో 2కే రన్‌ నిర్వహించనున్నారు. ఖలీల్‌వాడిలోని నిజామాబాద్‌ రుమటాలజీ, ఆర్థరైటీస్‌ సెంటర్‌ ఆస్పత్రిలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిర్వాహకులు మాట్లాడారు. కీళ్లవాతం(ఆర్థరైటీస్‌)లో లూపస్‌ అనేది ప్రమాదకరమైనదన్నారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు 2కే రన్‌ నిర్వహిస్తున్నామన్నారు. లూపస్‌ అనేది ప్రాణాంతకమైనది కాకున్నప్పటికీ రోగనిరోధక శక్తిని దెబ్బ తీస్తుందని, పర్యావసనంగా అవయవాలపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. 2కే రన్‌కు ముఖ్య అతిథులుగా ఐఎంఏ అధ్యక్షుడు అజ్జ శ్రీనివాస్‌, సెక్రెటరీ విక్రమ్‌ రెడ్డి, ట్రెజరర్‌ రాజేందర్‌, వైద్యులు హాజరవుతారని, నగర ప్రముఖులు, ప్రజలు పాల్గొనాలని కోరారు.

‘సాక్షి’పై కక్ష సాధింపు సరికాదు



ఎల్లారెడ్డి: సాక్షి దినపత్రికపై ఆంధ్రప్రదేశ్‌ ప్రభుత్వం కక్ష పూరితంగా వ్యవహరించడం సరికాదని జర్నలిస్టులు పేర్కొన్నారు. సాక్షి ఎడిటర్‌ ధనంజయరెడ్డి ఇంటిపై ఏపీ పోలీసుల దాడిని శుక్రవారం ఎల్లారెడ్డి జర్నలిస్టులు ఖండించారు. నిజాలను బయట పెడుతున్న సాక్షి పత్రికపై తెలుగుదేశం ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం సిగ్గుచేటన్నారు. అనంతరం ఎల్లారెడ్డి ఆర్డీవో కార్యాలయంలో ఇన్‌చార్జి ఏవో చంద్రశేఖర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఎన్‌యూజే జాతీయ ఉపాధ్యక్షులు రాజేందర్‌నాథ్‌, జర్నలిస్టులు రామప్ప, మహేష్‌, సిద్దు, యశ్వంత్‌ పవార్‌, సంగ్రాం, నాగేశ్వర్‌రావు, శ్రీనివాస్‌, రాజ్‌కుమార్‌, శివకుమార్‌ పాల్గొన్నారు.

23ఏళ్ల భూవివాదానికి తెర

- రాజీ కుదిర్చిన జడ్జి గోపీకృష్ణ
- లోక్‌ అదాలత్‌ అవార్డు జారీ

ఖలీల్‌వాడి: దీర్ఘకాలిక భూ వివాదాన్ని నిజామాబాద్‌ ప్రిన్సిపల్‌ జూనియర్‌ జడ్జి కుమారం గోపీకృష్ణ పరిష్కరించారు. 30 గుంటల భూమి కోసం 23న్నర ఏళ్లుగా ఇరువర్గాలు న్యాయపోరాటం చేయగా జడ్జి రాజీకుదిర్చి లోక్‌ అదాలత్‌ అవార్డు జారీ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. నవీపేట్‌ మండలం దర్యాపూర్‌ గ్రామానికి చెందిన సంతోష్‌ రెడ్డి అనే వ్యక్తి బిల్లి చిన్న గంగారాం వద్ద 30 గుంటల భూమిని 2002 మార్చి 7న కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్‌ చేసుకున్నాడు. కాగా, ఆ భూమి తమ పూర్వీకులదని, అమ్మే హక్కు తమ తండ్రికి లేదని చిన్న గంగారాం కుమారులు పెద్ద గంగాధర్‌, గంగారాం, సత్యనారాయణ, గాంధీలు సంతోష్‌ రెడ్డితో గొడవపడుతూ ఇబ్బందులకు గురి చేసేవారు. దీంతో సంతోష్‌రెడ్డి నిజామాబాద్‌ ప్రిన్సిపల్‌ జూనియర్‌ సివిల్‌ జడ్జి కోర్టులో 2002 సెప్టెంబర్‌ 2న సివిల్‌ దావా వేయగా, 2004 ఆగస్టు 18న అనుకూలంగా తీర్పు వచ్చింది. దీంతో ఆ భూమిని సంతోష్‌రెడ్డి ఇతరులకు విక్రయించాడు. అదే సమయంలో జూనియర్‌ సివిల్‌ కోర్టు తీర్పును గంగారాం కుటుంబం జిల్లా కోర్టులో అప్పీలు చేసింది. అక్కడ కూడా వారు ఓడిపోయారు. అనంతరం మళ్లీ గొడవలు జరగగా, సంతోష్‌ రెడ్డి కోర్టు ధిక్కరణ పిటిషన్‌ దాఖలు చేశారు. పిటిషన్‌ పరిశీలించిన కోర్టు గంగారాం కొడుకులకు నెల రోజుల సివిల్‌ జైలు శిక్షను ఖరారు చేసింది. దీంతో రాష్ట్ర హైకోర్టులో సవాల్‌ చేసి స్టే తెచ్చుకున్నారు. కేసు పూర్వాపరాలు అధ్యయనం చేసిన జడ్జి గోపీకృష్ణ, సంతోష్‌ రెడ్డి తరపు న్యాయవాది జక్కుల వెంకటేశ్వర్‌, బిల్లి గంగరాం కుటుంబసభ్యుల తరపు న్యాయవాది శ్రీహరి ఆచార్యతో సంప్రదింపులు జరిపి రాజీవైపు నడిపించారు. భూమిని ఇరువర్గాలకు సమభాగంగా పంచి వివాదానికి అంతిమ పరిష్కారం చూపారు. కక్షిదారుల తరపున న్యాయవాదులతో లోక్‌ అదాలత్‌ బెంచ్‌లో ఒక ఉమ్మడి రాజీ పరిష్కార పిటిషన్‌ దాఖలు చేయడంతో అవార్డును జారీ చేశారు.

క్రైం కార్నర్‌

డ్రంకన్‌డ్రైవ్‌ కేసులో ఇద్దరికి జైలు

రుద్రూర్‌: మండల కేంద్రంలో నాలుగు రోజుల క్రితం పోలీసులు డ్రంకన్‌ డ్రైవ్‌, వాహనాల తనిఖీలు చేపట్టారు. బొప్పపూర్‌ గ్రామానికి చెందిన సాయిలు, రానంపల్లి గ్రామానికి చెందిన వీరేశంలు మద్యం తాగి వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డారు. శుక్రవారం వారిని కోర్టులో హాజరుపరచగా జడ్జి ఒకరికి మూడురోజుల జైలు, మరొకరికి రెండు రోజుల జైలుశిక్షతోపాటు రూ.1000 జరిమానా విధించినట్లు ఎస్సై తెలిపారు.

సిలిండర్‌ లీకై మంటలు



నందిపేట్‌(ఆర్మూర్‌): మండల కేంద్రంలోని రాజనగర్‌ ప్రాంతంలో నివాసం ఉంటున్న గందం గంగామణి ఇంట్లో శుక్రవారం సిలిండర్‌ నుంచి గ్యాస్‌ లీకై మంటలు వ్యాపించాయి. వెంటనే స్థానికులు స్పందించి మంటలను ఆర్పివేశారు. దీంతో పెను ప్రమాదం తప్పిందని అందరూ ఊపిరి పీల్చుకున్నారు. కాగా ఇంట్లో మంటలు వ్యాపించడంతో విలువైన సామగ్రి, నిత్యవసర సరుకులు కాలిపోయాయి.

విద్యుత్‌ షాక్‌తో ఆవు మృతి



రాజంపేట: మండలంలోని షేర్‌ శంకర్‌ తండాలో విద్యుత్‌ షాక్‌తో ఓ ఆవు మృతి చెందింది. తండాలోని రైతు కాట్రోత్‌ సురేందర్‌కు చెందిన ఆవు శుక్రవారం ఉదయం గ్రామ శివారులో మేతకు వెళ్లగా సమీపంలోని విద్యుత్‌ వైర్ల కర్ర విరిగిపడగా, కర్రకు కట్టిన విద్యుత్‌ తీగలు ఆవుపై పడటంతో షాక్‌తో మృతిచెందింది. సుమారు రూ. 50వేల వరకు నష్టపోయానని ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

కామారెడ్డి క్రైం/సదాశివనగర్‌(ఎల్లారెడ్డి): పాత గొడవలను మనసులో పెట్టుకుని వ్యక్తిని హత్య చేసిన నిందితుడికి జీవిత ఖైదు విధిస్తూ కామారెడ్డి కోర్టు శుక్రవారం తీర్పు వెల్లడించింది. వివరాలు ఇలా.. సదాశివనగర్‌ మండలం మర్కల్‌ వద్ద జాతీయ రహదారి పక్కన కల్వర్టు కింద 2020 జూలై 13న ఓ మృతదేహం ఉందని సమాచారం రావడంతో పోలీసులు విచారణ జరిపి మృతుడిని సదాశివనగర్‌కు చెందిన మాడల సతీష్‌గా గుర్తించారు. అతనికి, అదే గ్రామానికి చెందిన గోల్కొండ రవి కుమార్‌కు మధ్య గొడవలు ఉండేవి. సతీష్‌ తరచుగా రవి కుమార్‌ను, అతని కుటంబ సభ్యులను తిడుతుండేవాడు. దీంతో అతడిని ఎలాగైనా చంపాలని రవి నిర్ణయించుకున్నాడు. అదే సంవత్సరం జులై 10న రవి ఆర్మూర్‌ దాకా వెళ్లి వద్దామని అతడిని నమ్మించాడు. సదాశివనగర్‌ మండల కేంద్రం శివారులోని కామారెడ్డి వైపునకు వెళ్తున్న మార్గమధ్యలో రహదారిపై ఉన్న కల్వర్టు వద్దకు తీసుకెళ్లి కూర్చోబెట్టి ఆ తర్వాత వంతెన పైనుంచి కిందికి తోసి వేశాడు. దీంతో సతీష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే రవీందర్‌ కల్వర్టు కిందికి వెళ్లి గాయాలతో కొట్టుకుంటున్న సతీష్‌ను రాయితో తలపై కొట్టి హత్య చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి, నిందితుడిని కోర్టులో హాజరుపర్చారు. నేరం రుజువు కావడంతో జిల్లా న్యాయమూర్తి సీహెచ్‌ వీఆర్‌ఆర్‌ వరప్రసాద్‌ నిందితుడికి జీవిత ఖైదుతోపాటు, రూ.2వేల జరిమానా విధిస్తు తీర్పు ఇచ్చారు. అప్పటి సదాశివనగర్‌ సీఐ వెంకట్‌, ఎస్సై జగడం నరేశ్‌, ప్రస్తుత సీఐ సంతోష్‌కుమార్‌, ఎస్సై రంజీత్‌లను ఎస్పీ రాజేశ్‌ చంద్ర అభినందించారు.

బైక్‌ చోరీల కేసులో నిందితుడి అరెస్టు



నిందితుడిని పట్టుకున్న పోలీసులు

మోపాల్‌(నిజామాబాద్‌రూరల్‌): చెడు వ్యసనాలకు బానిసై చోరీలకు పాల్పడుతున్న నిందితుడిని అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై యాదగిరిగౌడ్‌, సీఐ సురేష్‌ తెలిపారు. మోపాల్‌ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం వారు కేసు వివరాలను వెల్లడించారు. జిల్లాకేంద్రంలోని వివేకానంద కాలనీకి చెందిన భూమిగారి నవీన్‌, తల్లి రాజేశ్వరితో కలిసి నివాసం ఉంటున్నాడు. కూలీ పని చేసుకునే క్రమంలో చెడు వ్యసనాలకు బానిసై ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడేవాడు. పలు కేసుల్లో గతంలో జైలు జీవితం గడిపాడు. జైలు నుంచి బయటకు వచ్చిన అతడు కొన్ని నెలలుగా బతుకుదెరువు కోసం ఆటో నడుపుకుంటున్నాడు. కానీ ఆదాయం సరిపోకపోవడంతో మళ్లీ దొంగతనాలకు పాల్పడ్డాడు. ఈనెల 5న రోటరీనగర్‌లో బైక్‌ చోరీ చేసి, అదేరాత్రి మంచిప్ప శివారులోగల గండి మైసమ్మ ఆలయంలో, ముదక్‌పల్లిలోని సూదులమ్మ ఆలయంలో చోరీకి పాల్పడ్డాడు. అలాగే ఇంటి ఆవరణలో పెట్టిన బైక్‌ను చోరీ చేశాడు. బైక్‌లను శుక్రవారం తరలిస్తున్న క్రమంలో మోపాల్‌ పోలీసులకు పట్టుబడ్డాడు. నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా, నేరాలను ఒప్పుకున్నాడు. కేసు నమోదు చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ సురేష్‌ తెలిపారు. ఏఎస్సై రమేష్‌బాబు, సిబ్బంది దూప్‌సింగ్‌, తదితరులు పాల్గొన్నారు.

నగరంలో..



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని బోధన్‌ బస్టాండ్‌ వద్ద శుక్రవారం పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టగా, బైక్‌ చోరీ నిందితుడిని పట్టుకొని రిమాండ్‌కు తరలించారు. ఒకటో టౌన్‌ ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపిన వివరాలు ఇలా.. ఆర్మూర్‌లోని పెర్కిట్‌కు చెందిన సుల్తాన్‌ మోహిముద్దీన్‌ ఈనెల 7న రాత్రి తన బైక్‌ను నగరంలోని ప్రగతి హాస్పిటల్‌ ఎదుట పార్క్‌చేశాడు. మరుసటి రోజు వచ్చి చూసేసరికి బైక్‌ కనబడకపోవడంతో అతడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈక్రమంలో పోలీసులు బోధన్‌ బస్టాండ్‌లో వాహనాల తనిఖీలు చేస్తుండగా అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని పట్టుకున్నారు. అతడిని విచారించగా డిచ్‌పల్లి మండలం నడిపల్లిలోని గాంధీనగర్‌కు చెందిన సయ్యద్‌ మజద్‌గా గుర్తించారు. ఇతడు గతంలో మూడుసార్లు బైక్‌లు దొంగతనం చేసినట్లు చెప్పారు. అతడి వద్ద నుంచి నాలుగు కేసులకు సంబంధించి బైక్‌లను రికవరీ చేసినట్లు చెప్పారు. కోర్టులో హాజరు పర్చగా, కోర్టు రిమాండ్‌ విధించడంతో జైలుకు తరలించినట్లు చెప్పారు.

ఆటో బోల్తాపడి ఆరుగురికి గాయాలు



ఎల్లారెడ్డిలో బోల్తాపడిన ఆటో

ఎల్లారెడ్డి: బైక్‌ను తప్పించబోయి ఆటో బోల్తాపడటంతో ఆటోలోని ఆరుగురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. ఎల్లారెడ్డిలో ప్రయాణికులను ఎక్కించుకొని ఓ ఆటో రుద్రారం బయలుదేరింది. పట్టణంలోని ఎస్‌బీఐ బ్యాంకు ఎదుట ఆటోకు ఎక్సెల్‌ వాహనం అడ్డురావడంతో దానిని తప్పించబోయి బ్రేక్‌ వేయడంతో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న నిజాంసాగర్‌కు చెందిన రజిత, సుమలత, ఎల్లారెడ్డి మండలం బ్రాహ్మణపల్లికి చెందిన సంగవ్వ, మల్కాపూర్‌ గ్రామానికి చెందిన శేర్ల చంద్రయ్య, శకుంతల, లక్ష్మీలకు గాయాలయ్యాయి. వారిని స్థానికులు ఎల్లారెడ్డి ప్రభుత్వాస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. క్షత గాత్రులను మున్సిపల్‌ మాజీ చైర్మన్‌ కుడుముల సత్యనారాయణ పరామర్శించారు.

బైక్‌ అదుపుతప్పి ముగ్గురికి..



ఘటనస్థలంలో క్షతగాత్రులు

మద్నూర్‌(జుక్కల్‌): మండలంలోని మేనూర్‌ వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం బైక్‌ అదుపు తప్పడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయని స్థానికులు తెలిపారు. పిట్లం నుంచి మద్నూర్‌ వైపు బైక్‌పై ముగ్గురు వ్యక్తులు బయలుదేరారు. మేనూర్‌ వద్ద వారి బైక్‌ అదుపు తప్పడంతో డివైడర్‌కు ఢీకొన్నారు. ఈ ఘటనలో వారికి తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు వారిని మద్నూర్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

వేర్వేరు కారణాలతో ఇద్దరి ఆత్మహత్య

ఆర్మూర్‌టౌన్‌: ఆర్మూర్‌ మండలం అంకాపూర్‌ గ్రామంలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్‌ తెలిపిన వివరాలు ఇలా.. సిద్దిపేట్‌ జిల్లా సూర్యపేట గ్రామానికి చెందిన బండి బిక్షపతి(65) కొన్ని సంవత్సరాలుగా అంకాపూర్‌లో కూలీ పనిచేస్తు జీవనం సాగిస్తున్నాడు. కాగ రోజూ మాదిరిగానే శుక్రవారం ఉదయం కూలీ పనికి వెళుతున్నాంటూ ఇంట్లో నుంచి వెళ్లాడు. కాగ వ్యవసాయ క్షేత్రంలోనే బిక్షపతి చెట్టుకు ఉరి వేసుకొని, ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అప్పుల బాధతో ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతుడి భార్య ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

పిట్లం మండలంలో..



పిట్లం(జుక్కల్‌): మద్యానికి బానిసై తాగిన మైకంలో ఓ వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని రాంపూర్‌ గ్రామంలో చొటుచేసుకుంది. ఎస్సై రాజు తెలిపిన వివరాలు ఇలా.. రాంపూర్‌ గ్రామానికి చెందిన కమ్మరి రాజు (33) గత కొంతకాలం నుంచి మద్యానికి బానిసయ్యాడు. గురువారం రాత్రి తాగిన మైకంలో ఇంట్లో దూలానికి చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య సరోజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



బాన్సువాడ రూరల్‌: మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. బాన్సువాడ పట్టణానికి చెందిన గూడ సంతోష్‌ కుమార్‌(45) గురువారం రాత్రి బైక్‌పై బయలుదేరాడు. బాన్సువాడ–బీర్కూర్‌ రహదారిపై కొల్లూర్‌ రైస్‌ మిల్‌ సమీపంలో అతడికి మరో బైక్‌ ఎదురుగా రావడంతో రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ఘటనలో సంతోష్‌కు తీవ్రగాయాలు కావడంతో ఘటన స్థలంలోనే మృతి చెందాడు. బాన్సువాడ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి అదృశ్యం

ఎల్లారెడ్డిరూరల్‌: మండల కేంద్రానికి చెందిన షేక్‌ సలీం(28) అనే యువకుడు అదృశ్యమైనట్లు ఏఎస్సై సిద్దీఖీ శుక్రవారం తెలిపారు. ఈనెల 4న ఇంటి నుంచి వెళ్లిన సలీం ఇంతవరకు తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు ఎంత వెతికినా అతడి ఆచూకీ లభించలేదు. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేయగా మిస్సింగ్‌ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.